సాక్షి
రంగారెడ్డి

గురువారం । 21 । మార్చి । 2024




వాహనాల తనిఖీ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆదేశించారు. 8లో▸



'అడుగంటిన' ఆశలు

వేసవి ఆరంభం నుంచే భానుడు విశ్వరూపం దాల్చాడు. ఎండలతో జిల్లాలోని చెరువులు, కుంటల్లో నీరు అడుగంటాయి. 8లో▸



న్యూస్‌రీల్

'డీహెచ్ఎం-117'తో అధిక దిగుబడి

వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ నాగేష్ కుమార్



బైరంపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

కొందుర్గు: అధునాతన పద్ధతుల ద్వారా సాగులో అధిక లాభాలు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగేష్ కుమార్ అన్నారు. కొందుర్గు మండలం బైరంపల్లిలో మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రోత్సాహంతో రైతు భాస్కర్ సాగుచేసిన డీహెచ్ఎం-117 రకం పంటను బుధవారం నాగేష్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాది యాసంగిలో 70 శాతం మేర ఎస్సీ రైతులు ఉన్న గ్రామాన్ని ఎంపిక చేసుకోవడంలో భాగంగా బైరంపల్లిని ఎంపిక చేసి 25 మంది రైతులకు ఉచితంగా ఒక ఎకరాకు సరిపడా మొక్కజొన్న విత్తనాలతో పాటు టార్పాలిన్ ఇచ్చామన్నారు. పంట నూర్పిడికి సిద్ధం అయిన వెంటనే ప్రభుత్వ ఖర్చుతో యంత్రాలతో హార్వెస్టింగ్ చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసిన డీహెచ్ఎం-117 రకం విత్తనాలు ప్రైవేట్ కంపెనీల విత్తనాల కంటే మేలురకంగా ఉండటంతో పాటు ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ పరమేశ్వరి, ఏఓ మధుసూదన్, ఏఈఓలు వాసవీ, లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బన్సీలాల్

ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఆమనగల్లు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బన్సీలాల్, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సత్యం, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హస్తం పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గ నేతలతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బుధవారం నగరంలోని ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కలిశారు.ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి రాకతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బలం పెరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జగన్‌రెడ్డి, అరవింద్, బాలకిషన్, సుధాకర్ గౌడ్, భూపాల్‌రెడ్డి, శైలజ తదితరులు ఉన్నారు.

మామిడి పండ్ల వ్యాపారులపై అధికారుల నజర్

సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలకు విరుద్ధంగా మామిడి పండ్లను మగ్గపెడుతున్న వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గడిచిన నాలుగు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన ఈస్ట్, సౌత్, సౌత్ వెస్ట్ జోన్ల బృందాలు ఆరుగురు పండ్ల వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు డీసీపీ ఎస్.రశ్మీ పెరుమాళ్ తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో ఆయన మాట్లాడారు. మామిడి కాయల సీజన్ కావడంతో రసాయనాలను వినియోగించి పండ్లను మగ్గపెట్టే ప్రక్రియ పెరిగిందని టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో అధికారులు నాలుగు రోజులుగా వరుస దాడులు చేసి పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడే కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

గులాబీ కోటపై గురి!



చేవెళ్ల ఎంపీ సీటుపై కన్నేసిన కాంగ్రెస్, బీజేపీ

- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ప్రధాన పార్టీలు
- ఉద్దండులను బరిలో దింపేందుకు ఏర్పాట్లు
- పట్టు నిలుపుకొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ సీటును కైవసం చేసుకుని గులాబీ కోటను బద్దలు కొట్టాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. మరోవైపు స్టీరింగ్ చేజారకుండా చూసుకోవాలని కారు పార్టీ ప్రయత్నిస్తోంది. అత్యధిక ఓట్లను కలిగి పల్లె, పట్నంల కలబోతతో కూడిన ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో పట్టుకోసం మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉద్దండులు బరిలో నిలవనున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి మాజీ జెడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీ చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేసి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీచేసి గెలుపొందిన ఆయన ఈ సారి చేయి గుర్తుపై పోటీచేయాలని తహతహలాడుతున్నారు. ఇక ఇప్పటివరకు ఈ స్థానం నుంచి టికెట్ ఆశించి.. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ఆ పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చేలా కనిపిస్తోంది. చేవెళ్ల ఎంపీ స్థానానికి కాకుండా మల్కాజ్‌గిరి నుంచి ఆమెను బరిలో నిలపాలని ఆపార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు వారి వెంట నడిచిన కేడర్ నైరాశ్యంలో పడిపోయింది.

హాట్ టాపిక్‌గా చేవెళ్ల సీటు..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో జిల్లాలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల సహా వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం తెలంగాణలో చేవెళ్ల లోక్‌సభ సీటు హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడి నుంచి హేమాహేమీలు పోటీ చేస్తుండటమే ఇందుకు కారణం. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో 23 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 12,70,687 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్‌రెడ్డికి 5,16,363 ఓట్లు (40.64 శాతం) రాగా.. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 5,0,318 ఓట్లు(39.61 శాతం) వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బి.జనార్ధన్‌రెడ్డికి 1,95,919 ఓట్లు(15.42) వచ్చాయి. బీఎస్పీ సహా ఇతర పార్టీలకు కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. ప్రస్తుతం బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా గత ఎన్నికల్లో వేర్వేరు పార్టీల్లో కొనసాగిన వారే. రాజకీయంగా, ఆర్థికంగా ఈ ముగ్గురూ ఉద్దండులే. వీరిలో ఏ ఒక్కరు కూడా ఖర్చుకు వెనుకాడేవారు కాదు.

నైరాశ్యంలో పట్నం వర్గం..!

ఉమ్మడి జిల్లా రాజకీయాలపై పట్నం దంపతులది ప్రత్యేక ముద్ర. అధికారం ఎక్కడ ఉంటే.. మొదటి నుంచి వీరు అక్కడే కొనసాగుతూ వచ్చారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తన సతీమణి పట్నం సునీతారెడ్డిని కూడా రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. 2006లో టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన ఆమె బంట్వారం, యాలాల్, కోట్‌పల్లి జెడ్పీటీసీగా మూడుసార్లు గెలుపొందారు. 2006 నుంచి 2011 వరకు, ఆ తర్వాత 2014 నుంచి (టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు) 2019 వరకు ఇలా రెండుసార్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2019 నుంచి ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలె ఆమె బీఆర్ఎస్‌ను వీడి... కాంగ్రెస్‌లో చేరారు. అయితే చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలోకి పోటీచేసేందుకు గ్రౌండ్ లెవల్‌లో అంతా సిద్ధం చేసుకుంటుండగా.. ఇక్కడి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరుకోవడం.. ఆ వెంటనే ఇక్కడి ఎంపీ స్థానానికి ఆయన పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో పట్నం వర్గీయులు పునరాలోచనలో పడ్డారు.

బీఆర్ఎస్ నేతల భేటీ..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బుధవారం శంషాబాద్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సహా మాజీ మంత్రి సబితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు సురభీ వాణిదేవి, దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఇతర నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు చర్చించారు. ఎలాగైనా చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
మహేశ్వరం	511	5,56,110	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	5,99,778	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	7,47,757	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	2,69,166	1,35,261	1,33,820	06
పరిగి	269	2,66,273	1,33,625	1,32,639	09
వికారాబాద్	284	2,31,679	1,15,019	1,16,647	13
తాండూరు	269	2,42,3849	1,18,228	1,25,614	07



బుధవారం ఉదయం ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అంతయ్య



సాయంత్రం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ గూటికి అంతయ్య

తూచ్.. బీఆర్ఎస్‌లోనే ఉంటా

- ఒకేరోజులో రెండు పార్టీలు మారిన బీఆర్ఎస్ కౌన్సిలర్
- ఉదయం కాంగ్రెస్‌లోకి.. సాయంత్రం సొంతగూటికి

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీల నేతల వలసలు ఊపందుకున్నాయి. అయితే కొంతమంది నేతల తీరు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ క్రమంలో ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓ కౌన్సిలర్ సాయంత్రానికి మనసు మార్చుకొని తిరిగి సొంత గూటికి చేరారు. పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ 13వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ కానుగు అంతయ్య ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో తమకు విలువ లేదని, అందుకే పార్టీ మారుతున్నానని హస్తం నేతల వద్ద తనగోడు వెళ్లబోసుకున్నారు. అయితే ఇది జరిగిన కొద్ది గంటలకే (అదేరోజు సాయంత్రం) తిరిగి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. కన్న తల్లిలాంటి బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరడానికి తన మనస్సు ఒప్పుకోవడంలేదని అందుకే మనస్సు మార్చుకొని తిరిగి సొంతగూటికి వచ్చానని అంతయ్య ప్రకటించారు.

'కోడ్' పక్కాగా పాటించాలి



రాజకీయపక్షాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

- రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీఓ అనంతరెడ్డి సమీక్ష
- ఓటింగ్ శాతం పెంచేందుకు సహకరించాలని పిలుపు

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అన్ని రాజకీయ పార్టీలు కృషిచేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అన్ని పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాలకు తప్పక అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రతులను నేతలకు అందజేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, సీపీఎం పార్టీల నాయకులు.. సాయితేజ, జగదీశ్, ప్రతాప్, శేఖర్, పురుషోత్తం, సామేల్, రవీందర్ తదితరులు హాజరయ్యారు.

రూ.50వేల కంటే నగదు లభిస్తే సీజ్..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ, మండల పరిధిలోకి వచ్చే సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆర్డీఓ అనంతరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆగాపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ టీం, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు(ఎలాంటి ఆధారం లేని) లభిస్తే సీజ్ చేయాలని ఆదేశించారు.



షాబాద్ మండలంలోని పోతుగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్

- బిల్లుల వివరాలు సేకరిస్తున్న అధికారులు
- పాఠశాలలకు తగ్గనున్న ఆర్థికభారం
- సర్కార్ నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాల హర్షం

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. వీటికి తోడు విద్యుత్ బిల్లులు చెల్లించడం విద్యాశాఖకు గుదిబండగా మారింది. ఈ క్రమంలోనే జిల్లాలోని మెజార్టీ పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్న ఉచిత విద్యుత్ నిర్ణయంతో ఇకనుంచి ప్రభుత్వ బడులపై ఆర్థికభారం తప్పనుంది.

పెరిగిన వినియోగం..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు కేటగిరి-7ఏ కింద విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. పాఠశాలల్లోని మొక్కలకు, ఇతర అవసరాలకు బోరుబావి వాటర్‌ను వినియోగిస్తున్నారు. కంప్యూటర్ ప్రయోగశాలలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల గదుల్లో ఫ్యాన్లు, డిజిటల్ తరగతులకు ప్రొజెక్టర్లు ఉపయోగిస్తున్నారు. మన ఊరు-మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్ బోర్డు అందజేశారు. వీటన్నింటి వినియోగంతో విద్యుత్ బిల్లులు పెరుగుతూ వచ్చాయి. పాఠశాలల స్థాయిని బట్టి సుమారు రూ.2వేల నుంచి రూ.7వేల వరకు బిల్లులు వస్తున్నాయి. ఈ బిల్లులు ఆయా పాఠశాలలకు తలకుమించిన భారం కావడంతో ప్రభుత్వం తాజాగా ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఫిబ్రవరికి ముందు ఉన్న పెండింగ్ బిల్లులు, ఫిబ్రవరిలో వచ్చిన విద్యుత్ బిల్లుల వివరాలను సేకరించాలని ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

రెండు విడతలుగా నిధులు..

జిల్లా వ్యాప్తంగా 1,309 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 248, ప్రాథమికోన్నత పాఠశాలలు 180, ప్రాథమిక పాఠశాలలు 881 ఉన్నాయి. వీటితో పాటు కేజీబీవీ, మోడల్ స్కూళ్ల నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు చెల్లిస్తోంది. రూ.50వేలు అంతకన్నా ఎక్కువ నిధులిచ్చే పాఠశాలలు తక్కువ సంఖ్యలో ఉండగా రూ.25వేల లోపు ఇచ్చే పాఠశాలలు అధికంగా ఉన్నాయి. అయితే ఈ నిధులు రెండు విడతలుగా చెల్లించడంతో ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. వచ్చిన నిధులు కేవలం విద్యుత్ బిల్లులకు మాత్రమే కాకుండా సంవత్సరం పొడవునా వివిధ అవసరాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంపై ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ఏటా ప్రభుత్వ బడుల నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిపడక పోవడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపు భారంగా మారేది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. సర్వీస్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. వారిని కూడా వెంటనే నియమించాలి.

– బందయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు

కబ్జా మయం | చెరువు మాయం!



గతంలో అధికారులు వేసిన ఎఫ్‌టీఎల్ దిమ్మె కనిపించకుండా మట్టితో కప్పేసిన దృశ్యం



గువ్వకుంటలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు పాతుకున్న కడీలు

- ఆనవాళ్లు కోల్పోయిన గువ్వకుంట
- 27.27 ఎకరాల్లో వెలిసిన రియల్ వెంచర్
- అమాయకులకు ప్లాట్లు అంటగడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో చెరువుల ఆక్రమణకు అడ్డుకట్ట పడే పరిస్థితులు కనిపించడం లేదు. కబ్జాల పరంపరలో.. చెరువులు మాయమవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని 27.27 ఎకరాల్లో విస్తరించి ఉన్న గువ్వకుంట.. ప్లాట్లుగా మారింది. చెరువు కట్టను సైతం ధ్వంసం చేసి ప్లాట్లుగా మార్చినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో తూతూ మంత్రంగా ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారే తప్ప.. చెరువును కాపాడే ప్రయత్నం చేయలేదు.

హద్దులు, బఫర్ జోన్ నిర్ణయించినా..

నీటి వనరులకు సంబంధించిన భూముల పరిరక్షణ ప్రస్తుతం గాలిలో దీపంలా మారింది. చాలా వరకు చెరువుల నీటి మట్టం, హద్దులు గుర్తించలేదు. కొన్ని గుర్తించినా నోటిఫికేషన్ జారీ కాలేదు. ఫలితంగా శిఖం, బఫర్ జోన్లలో ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. గువ్వకుంటను గతంలోనే అధికారులు సర్వే చేసి హద్దులు, బఫర్‌జోన్ నిర్ణయించినా ఆక్రమణలు ఆగడం లేదు. ఎఫ్‌టీఎల్ దిమ్మెలను ధ్వంసం చేసిన రియల్ వ్యాపారులు, కొన్నింటిపై కనిపించకుండా మట్టిని పోశారు. దీంతో కుంటను మరోసారి సర్వే చేసి హద్దులను నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు.

మొత్తం 27.27 ఎకరాలు

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 618, 619, 620, 624, 625, 626, 628లో మొత్తం 27.27 ఎకరాల్లో గువ్వకుంట విస్తరించి ఉంది. ప్రస్తుతం ఇది మొత్తం రియల్ ఎస్టేట్ వెంచర్‌ను తలపిస్తోంది. ఎక్కడ చూసినా ప్లాట్ల హద్దు రాళ్లు, బేస్‌మెంట్ల నిర్మాణమే కనిపిస్తోంది. ఇందులో రోడ్లను చదను చేసి వెంచర్‌లా కలరింగ్ ఇస్తున్న అక్రమార్కులు ప్లాట్లుగా చేసి అమాయకులకు కట్టగడుతున్నారు. చెరువులు, కుంటలకు సంబంధించిన సర్వే నంబర్లు, బై నంబర్లలో ఉన్న భూములను నిషేధిత జాబితాలో చేర్చితే తప్ప ఇలాంటి విక్రయాలకు అడ్డుకట్ట పడే పరిస్థితి లేదు.

గతంలోనే ఫిర్యాదు చేశాం

గతంలోనే గువ్వకుంటను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాము. ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయొద్దని మున్సిపల్ అధికారులకు లేఖ రాశాం. మరోసారి కుంటను పరిశీలించి, నివేదిక ఇవ్వాలని డీఈ, జేఈని ఆదేశిస్తాం. చెరువులు, కుంటలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– బన్సీలాల్, ఇరిగేషన్ ఈఈ

సమన్వయ లోపం

కుంట కట్టను ధ్వంసం చేసిన మాట వాస్తవమే. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ముందుకు వస్తే చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ శాఖ సిద్ధంగా ఉంది. ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతోనే చట్టపరమైన చర్యలు తీసుకోలేకపోతున్నాం.

– భిక్షపతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అబ్దుల్లాపూర్‌మెట్

వేసవి ఆరంభం నుంచే భానుడు విశ్వరూపం దాల్చాడు. మండుతున్న ఎండలతో జిల్లాలోని చెరువులు, కుంటల్లో నీరు అడుగంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నేలలు నెర్రెలుబారి దర్శనమిస్తున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. వ్యవసాయ బోరు బావులు వట్టిపోయాయి. ఫిబ్రవరి నుంచే ఎండలు మండటం, చెరువులు, కుంటలతో పాటు, జలాశయాల్లో నీటిమట్టం తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. వచ్చే రెండు నెలలు పరిస్థితి ఇంకెలా ఉండబోతుందోనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

'అడుగంటిన' ఆశలు

ప్రమాద స్థాయిలో తగ్గిన భూగర్భజలాలు

- నెర్రెలు బారిన చెరువులు, కుంటలు
- తడిలేక ఎండుతున్న పంటపొలాలు
- పశువులకు మేతగా పొలాలు


ఎండిన చుక్కా చెరువు

'చుక్కా'నేరు లేదు

తలకొండపల్లి: ఎండలు ముదరక ముందే చెరువులు, కుంటలు ఎండుతున్నాయి. మండల పరిధి ఎడవెల్లి 'చుక్కాచెరువు' పూర్తిగా ఎండిపోయింది. గుంతలు ఉన్న చోట.. కొద్దిగా నీరు నిలిచి, తన ఉనికిని చాటుకుంది. చెరువు విస్తీర్ణం 60 ఎకరాలు. ఇది నిండి అలుగు పోసిన నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లోని 150 బోర్లల్లో నీటిమట్టం అమాంతం పెరుగుతుంది. తద్వారా ఏడాదికి రెండు పంటలు పండుతాయి. ఈ సారి చెరువు ఎండిపోయి, బోర్లల్లో నీరు అడుగంటింది. ఇది సాగుపై తీవ్ర ప్రభావం చూపనుంది. తాగునీటి కటకటా ఏర్పడనుందని రైతులు పేర్కొన్నారు.


యాచారం: అయ్యవారిగూడెంలో పగుళ్లు పట్టిన వరి చేను


యాచారం: ఎనెకింది తండాలో ఎండిన వరి పంటను మేస్తున్న పశువులు


మంచాల: తిప్పాయి గూడలో ఎండిన పంటను పశువులకు వదిలేసిన రైతు


మంచాల: వట్టిపోయిన బోరు


షాబాద్: కులాయిని తలపిస్తున్న బోరు మోటర్


షాబాద్: నరెడ్లగూడలో..

పకడ్బందీగా వాహనాల తనిఖీ

శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి


వాహన తనిఖీని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

కడ్తాల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టును బుధవారం అదనపు డీసీపీ రామ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి, పోలీస్ సిబ్బందికి డీసీపీ సూచనలు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, అక్రమంగా లిక్కర్, గంజాయి వంటివి తరలిస్తుంటే తనిఖీలో పట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేపట్టాలన్నారు. 24 గంటలు నిఘాను పటిష్ఠంగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు శివప్రసాద్, ప్రమోద్, ఎస్‌ఐలు వరప్రసాద్, బాల్‌రాం, శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన చేపల వేట

చెరువులో మునిగి ఇద్దరు మృతి


కిష్టయ్య (ఫైల్)


వెంకటేశ్ (ఫైల్)

కొత్తూరు: చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. మక్తగూడ గ్రామానికి చెందిన కిష్టయ్య (59), వడ్డె వెంకటేశ్(43) దినసరి కూలీలు. ఈ నెల 19న రాత్రి ఇద్దరు గ్రామ సమీపంలోని ఉప్పరోని కుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి, మునిగి చనిపోయారు. మరుసటి రోజు చెరువులో ఇద్దరి మృతదేహాలను గమనించిన స్థానికులు.. కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాలను బయటకు తీయించారు. వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై మృతుడి తల్లి పొన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా ఫాల్గుణి మేళా వేడుకలు



కాచిగూడ: మహాభారత యుద్ధ సమయంలో శ్యామ్ బాబా (కలియుగ కృష్ణుడు) తన శిరస్సును దానమిచ్చే రోజుగా చెప్పుకునే 'ఫాల్గుణి మేళా' వేడుకలను బుధవారం కాచిగూడలోని శ్యామ్‌బాబా మందిర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పతాకాలు చేతబట్టి.. గులాల్ చల్లుకుంటూ.. కృష్ణుడి చిత్రపటాలు ప్రదర్శించారు. శోభాయాత్రలో శ్రీశ్యామ్ మందిర్ సేవా సమితి ప్రతినిధులు ఇంద్రకుమార్ అగర్వాల్, సురేష్ అగర్వాల్, కైలాష్, రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత


పోలీసుల ఆధీనంలో ఉన్న టిప్పర్లు

మంచాల: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. ఎస్‌ఐ రవినాయక్ వివరాల ప్రకారం.. మంచాల–జాపాల మధ్య ఓ వ్యవసాయ పొలం వద్ద నుంచి మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు టిప్పర్లను ఆపారు. తనిఖీ చేయగా.. వాహనదారుల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో ఆ టిప్పర్లను ఠాణాకు తరలించారు. అనంతరం తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు స్వాధీనం చేశారు. మరో రెండు టిప్పర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆగి ఉన్న కారులో మంటలు


మంటల్లో కాలిపోతున్న కారు

ఆమనగల్లు: బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి కారులో మంటలు చెలరేగిన సంఘటన బుధవారం ఆమనగల్లు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన శశికుమార్ తన కారులో పట్టణంలోని కాశీనాథ్ ఇంటికి మంగళవారం రాత్రి వచ్చారు. కారును ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేశారు. ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగడంతో గమనించిన కాలనీవాసులు వెంటనే స్పందించారు. కారుపై నీళ్ల చల్లి మంటలు ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోవడంతో సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాల్‌రాం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు సేకరించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కూతురు హత్య కేసులో తల్లికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: కన్న కూతుర్ని కడతేర్చిన కేసులో కసాయి తల్లి కటకటాల పాలయింది. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్యలు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన ఎం.భార్గవి(20) డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతూ.. అదే గ్రామానికి చెందిన శశిను ప్రేమించింది. వారి ప్రేమ వ్యవహారం తెలిసి భార్గవి కుటుంబంలో గొడవలు జరిగాయి. బంధువుల అబ్బాయితో యువతి వివాహం జరిపించాలని నిర్ణయించుకున్నారు. తాజాగా సోమవారం భార్గవి ఇంటికి శశి వచ్చాడు. ఈ క్రమంలో యువతి తల్లి జంగమ్మను గమనించిన యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తీవ్ర ఆవేశానికి గురైన జంగమ్మ.. కూతుర్ని మందలించి, కొట్టింది. చీర కొంగును మెడకు బిగించి ఊపిరి ఆడకుండా చేసింది. దీంతో భార్గవి చనిపోయింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులను విచారించిన పోలీసులు.. యువతి చావుకు తల్లి జంగమ్మనే కారణమని, నిందితురాలిగా పేర్కొంటూ ఆమెను బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం


ప్రమాదానికి గురైన కారు

బంజారాహిల్స్: అదుపు తప్పిన వేగంతో దూసుకెళ్తున్న ఓ కారు స్వీయ ప్రమాదానికి గురికాగా.. కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బెలూన్ ఓపెన్ కావడంతో కారు డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కూకట్‌పల్లికి చెందిన నర్సింగ్ మైండ్‌స్పేస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను తన కారులో డ్రాప్ చేస్తుంటాడు. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారు జామున ఇంజినీర్లను తీసుకురావడానికి తన కారు (టీఎస్09 యూఈ 2676)లో మాదాపూర్ వైపు వెళ్తుండగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45 బాలకృష్ణ ఇంటి చౌరస్తాలో కారు అదుపుతప్పి వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు టైరు ఊడిపోయింది. ఎయిర్‌బెలూన్ తెరుచుకోవడంతో కారు నడుపుతున్న నర్సింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కారు డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా జీరో వచ్చింది. అతివేగంగా కారు నడుపుతూ ప్రమాదానికి పాల్పడిన నర్సింగ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 279, 336ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్, కండక్టర్‌తో ఘర్షణ

ముగ్గురిపై కేసు నమోదు

యాచారం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. డ్రైవర్, కండక్టర్‌తో ఘర్షణ పడిన సంఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్గొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో మంగళవారం రాత్రి 10 గంటలకు నగరానికి చెందిన సూరిగౌడ్, మురళీ, రామలింగంలు మాల్‌లో బస్సు ఎక్కి, నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో యాచారం–మాల్ మధ్యలో ఆర్టీసీ ఉద్యోగులతో వారు ఘర్షణకు దిగారు. దీంతో సిబ్బంది యాచారం పోలీస్‌స్టేషన్ వద్ద బస్సును ఆపి, గొడవకు దిగిన ముగ్గురిని పోలీసులకు అప్పగించారు. అయినప్పటికీ.. ఠాణాలో వాగ్వాదం చేశారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన తోక రాములు(50) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. కొంత కాలంగా ఎలాంటి పని చేయకుండా ఇంటికే పరిమితం అయి, మద్యానికి బానిసగా మారాడు. అందుకు అప్పులు కూడా చేశాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం.. అత్తింటి వారు పొలం విక్రయించగా వచ్చిన డబ్బును తీసుకు రావాలని భార్యతో పట్టుబట్టాడు. లేని పక్షంలో సొంత పొలం కొంత అమ్ముదామని గొడవకు దిగాడు. ఆమె అందుకు ఒప్పుకోకుండా.. ఆడ పిల్లలు ఉన్నారని వారించింది. దీంతో మంగళవారం గొడవపడి ఇంటి నుంచి వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. ఫోన్ చేశారు. కానీ అతను ఎత్తలేదు. దీంతో భర్త ఆచూకీ కోసం భార్య పొలం వైపు వెళ్లగా.. అక్కడ ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. అప్పటికే రాములు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: బెల్ట్ దుకాణాలపై పోలీసులు దాడులు చేసి, 35 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాహెబ్‌గూడ, మంగల్‌పల్లి, పోచారం, ఎల్మినేడు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ లిటరసీ హౌజ్‌లో పేపర్ బ్యాగ్స్ మేకింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సులో చేరే వారికి ఆరు రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని లిటరసీ హౌజ్ కార్యదర్శి డాక్టర్ బి.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 31 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు 99512 10441, 70134 57432 నంబర్లలో ఆఫీస్ పనివేళల్లో సంప్రదించాలన్నారు.